పరామర్శ

బుజ్జా వెంకటసుబ్రహ్మణ్యము

తన మొగుడు పోయాడన్న వార్త వచ్చిననాడు అందరూ అంతమతులుపోయినవాళ్లల్లా ఏడవడానికి కారణం ఒకవిధంగా తనకి బోధపడింది. పక్కఇంటివారి జానమ్మమాట తలపెట్టినప్పుడల్లా అందరూ 'అయ్యో పాపం!' అనడం తను చూస్తూనేఉందికా! కాని పక్కఇంటివారిజానమ్మ శుభ్రంగా పెద్దతరగతులలో చదువుకుంటోంది, మిగిలిన ఆడపిల్లలలా కాకుండా ఇప్పుడు తనుగూడా జానమ్మలా చదువుకోవాలన్నమాట!

ఇంట్లోఉన్నవాళ్లందరూ ఒక్కసారిగా గొల్లుమన్నారు. "ఏమిపాపం చేసుకున్నావే, నాతల్లీ? ఏమిపాపంచేసుకున్నావే? ఏమిపాపంచేసుకున్నావే?" అంటూ తనతల్లి తనని కాగలించుకొని నేలమీదకూలబడి ఏడుపు మొదలుపెట్టింది. "పిలిచిపిల్లనిస్తే శత్రువైపోయాడే! పరమశత్రువైపోయాడే!" అని మళ్లీ మళ్లీ తననాయనమ్మ గోలపెట్టూ, తలబాదుకుంటూ ఒకమూల చతికిలబడింది. తనఅన్నగారు తనరెండుచేతులూ రెండుచేతులలోనూ గట్టిగాపట్టుకుని పెద్దపెట్టున రాగాలుపెట్టూ కూర్చున్నాడు. ఇంటిదాసీమనిషి కూడా పనిమానుకునివచ్చి స్తంభానికి జార్లబడి అందరికేసీ చూస్తూ, తనూ ఏడుస్తోంది. అసలుకారణంఅటుండగా వీళ్లందరూ ఇలాఏడవడంచూస్తూ తనుగూడా నుక్కతిరగకుండా ఏడ్చిఏడ్చి, ఆఖరికి సొమ్మసిల్లిపోయింది. మొదటినుంచీ వీథిలో వచ్చీపోయేవాళ్లందరూ ఏడుపుధ్వనులువిని కిటికీలలోంచి తొంగిచూడడం, ఎరుగున్నవాళ్లూ ఎరగనివాళ్లూ లోపలికిచొరబడి కాసేపు దుఃఖంగా తమఅందరికేసీ చూసివెళ్లిపోవడంతను కనిపెట్టూనేఉంది. కాని మరికొన్నిసంవత్సరాలు జరిగిపోయేవరకూ ఆనాటివార్త ఎంతదుఃఖకరమైనదో తను సమంగా గ్రహించలేదు.

ఆవార్త వచ్చిననాటికి పదహారురోజులక్రిందట తనకి పదేళ్లు నిండేయి. అంతకి ఆరునెలలక్రిందట తన పెళ్లిసంబరాలు జరిగేయి. తనకి పెళ్లికానిరోజులలో కామమ్మత్తకొడుకైన నారాయణరావు తనమొగుడని అందరూ వేళాకోళంచేసేవారు. ఆరోజులలో 'నారాయణరావుబావ' అంటే తనకి చాలాసిగ్గుగాకూడాఉండేది. కాని, ఏకారణాలవల్లనైతేనేమి, ఆసంబంధం పడిపోయింది. కామమ్మత్త అందరితోనూచెప్పడం పిల్లకీ పిల్లవాడికీ మూడేళ్లేభేదంకనుక పెళ్లిమాటతలపెట్టలేదని. అసలుకారణం కామమ్మత్తకీ, కామమ్మత్తపెద్దకొడుకు శివరావుకీ కట్నంఆశ ఎక్కువగాఉండడం. ఈసంబంధంచేసుకుంటే డబ్బేమీరాదని వాళ్లిద్దరికీ బాగాతెలుసును. పెద్దకట్నాలిచ్చేందుకూ, ముచ్చట్లన్నీ జరిపేందుకూ పిల్లతండ్రైనా బ్రతికిలేడు!

ఆఖరికి తనకి పరాయిసంబంధమే వచ్చింది. తనపెళ్లికి నారాయణరావుబావకూడా వచ్చాడు. మొదటిరోజున నారాయణరావుకేసి చూస్తుంటే ఒకటి రెండుసార్లు పూర్వం అందరూ వేళాకోళానికి అంటూవుండే మాటలు జ్ఞాపకం వచ్చాయి. కాని, ఈ పెళ్లికొడుకు నారాయణరావుకంటె చాలా ఎక్కువ అందమైనవాడనీ లెక్కలేనంత ఎక్కువ తెలివైనవాడనీ అందరూ అనడంవల్లనూ, కొత్తబట్టలలోనూ సంగీతసభలలోనూ ఊరేగింపులలోనూ తనకిసరదా రోజురోజుకీ హెచ్చిపోవడంవల్లనూ నారాయణరావుమాట రెండురోజులలో తను పూర్తిగా మరచిపోయింది.

తనమొగుడుపోయిన నాల్గవరోజున తన పినతల్లి వీరభద్రమ్మా, వీరభద్రమ్మకూతురు సీతా తమ యింటికి వచ్చారు. వాళ్లూ గుమ్మంలో కాలుపెట్టగానే తననాయనమ్మా, అమ్మా ఇద్దరూ గొల్లుమని ఏడవడం మొదలుపెట్టేరు. వీరభద్రమ్మపిన్ని చీరకొంగుతో కళ్లు తుడుచుకుంటూ తనని కాగలించుకుని ఏడ్చింది. తనకి

కూడా మళ్లీ ఏడుపు వచ్చింది. నాలుగురోజులబట్టి చుట్టాలూ, స్నేహితులూ పరామర్శకిరావడం, తనదగ్గర కూర్చోడం, వాళ్లు ఏడవడం, తను ఏడవడం జరుగు తూనే ఉన్నాయి. మొదటిరోజు రాత్రి ఎవరూ అన్నాలు తినలేదు. ప్రతివాళ్లూ మిగిలినవాళ్లని 'అన్నాలు తినండర్రా' అని పోరేవాళ్లేకాని ఒక్కరూ భోజనాలకి లేవలేదు. రాత్రి తను కొంచెం పాలు తాగింది. రోజల్లా మంచినీళ్లుమట్టుకు అందరూ చెం బులకొలది తాగేరు. రెండవరోజున మళ్లీ ఒక్కపూటే భోజనం చేసేరు. పొద్దున్న తనకి మూలగదిలోకి వాళ్లమ్మ కాస్తచేరూ అన్నం కాస్తమజ్జిగా అన్నం తెచ్చి పెట్టింది. ఆసాయింత్రం తనకి కాఫీతాగాలనిపించి నప్పటికీ ఎవరూ తాగడంలేదనిచూసి తను అడగడానికి సందేహించింది. రాత్రి వాళ్ల నాయనమ్మ కొంచెం మజ్జిగతెచ్చి ఇచ్చింది. మొన్నాడుపొద్దున్న ధైర్యంచేసి తను కాఫీ కావాలంది. ఆతర్వాత కాఫీలూ, భోజనాలూ అన్నీ మామూలుగానే జరిగేయి.

నాలుగురోజులుగడిచేక అందరిదుఃఖాలూ కొంచెం అణిగినట్టు అనిపించింది. అదికాక తనకి సీత రావడంవల్ల ఒక కొత్తవ్యాపకం దొరికింది. సీతతండ్రి ఇప్పుడు దక్షిణాన్ని ఏదోపెద్దఊళ్లో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. సీత అనేక కొత్తసంగతులగురించి తనతో మాట్లాడుతూఉండేది. సీత తనకంటె రెండేళ్లపైన ఆరు నెలలు చిన్నదైనప్పటికీ తనకంటె పెద్దదానిలా కబుర్లు చెప్తూఉండేది. అన్నిటికంటే ముఖ్యమైనసంగతి, సీతకి చీట్లపేక ఆడడం తెలుసును. ఈసారివస్తూ ఒక చీట్లపేక తీసుకువచ్చిందికూడాను. ఇద్దరిలో ఆడగలిగిన ఆటలు సీతకి అనేకం తెలుసును. అవన్నీ తనకిప్పుడు నేర్పింది. ఈ ఆటలు నేర్చుకుని ఆడుకుంటూ ఉండేసరదాలో మిగిలిన ఆలోచనలు తనకి దూరమైపోయాయి.

రెండుమూడుసార్లు సీతా, తనూ ఆడుకుంటూ, ఉండగా పరామర్శకి కొందరుమనుష్యులురాగానే తన నాయనమ్మవచ్చి సీతని కోప్పడి, ఆపేకముక్కలన్నీ దాపించేసి, ముందు సావిట్లోకివెళ్లి, మామూలుగా వచ్చినవాళ్లతోకూర్చుని ఏడ్చి, తర్వాత వాళ్లని తనగదిలోకి పరామర్శకి తీసుకువచ్చేది. రానురాను తనకొక విచిత్రమైన విషయం తేటబడింది. పరామర్శకి మొదటి రోజులలో రాకుండా ఆలస్యంగావచ్చినవాళ్లు చాలా మంది కంటనీరు పెట్టకుండా తనకేసి తేరిబారిచూసి వెళ్లిపోయేవారు. తనఅమ్మా నాయనమ్మా మట్టుకు ప్రతి క్షణం కళ్లు పంచకొంగులతో అద్దుకుంటూ ఉండేవారు. అటువంటి సమయాలలో తనకి ఏడుపువచ్చేదికాదు.

ఒకరోజున తనూసీతా ఆడుకుంటూఉండగా ఎవరోపరామర్శకివస్తే తన నాయనమ్మవచ్చి క్రిందపడి ఉన్న పేకముక్కలన్నీ మాట్లాడకుండా లాక్కుని పెట్టెసందునపారేసింది. చేతులలో ముక్కలుమట్టుకు చేతులలోనే ఉన్నాయి. ఆటపట్టుదలలో సీతకీ తనకీ కూడా చాలాకోపంవచ్చింది. ఆకోపంలో తను "ఎవరు వచ్చినాసరే, నేను పేకాడడంమానను, నాయనమ్మా" అంది. తననాయనమ్మ ఒక్కక్షణం ఏడుపుముఖంపెట్టి తెల్లబోయిచూస్తూ చటుక్కన సీతచేతిలోఉన్న పేక ముక్కలునాలుగూ లాక్కుని చింపి ఒకమూలగా విసి రేసింది. సీత భేరుమని ఏడుస్తూ వాళ్లఅమ్మదగ్గరకి పరుగెత్తింది.

పదవరోజున తనకి పుస్తెలుతీసేసేరు. అప్పుడు కూడా తనకి ఏడుపురాలేదు. ఆతర్వాత అయిదారు నెలలవరకూ మామూలుగా పాఠశాలకి వెళ్లడంమాను కుంది ఆ అయిదారునెలలూ తన అన్నగారూ, అమ్మా తనచదువులగురించి అఖండంగా వాదించుకునేవారు. తనకి చదువుకోవాలన్న అభిలాష ఉండడంవల్ల అన్న గారుచెప్పినట్టు చెన్నపట్నంవెళ్లి వితంతుశరణాలయంలో చదువుకునేందుకు తను చాలాఇష్టపడింది. తనతల్లికి అది ఏమాత్రమూ నచ్చలేదు. "అబ్బాయీ నాకేమీ తెలి యదు. నేనెప్పుడూ దగ్గరఉండవలసినరోజులు దానికి. నేనెప్పటికీ ఒప్పను"అని వాదించే దావిడ. "శరణాలయం వాళ్లు ఆడపిల్లల్ని చూసుకోడంలో నీకు తీసిపోరు" అని తనఅన్నగారు అంటూఉండేవారు. అతను పెద్ద చదువులు చదువుకోనకపోయినప్పటికీ, చెల్లెలైన తనకి చదువులు పూర్తిగాచెప్పించాలని అతను శపథంపట్టేడు.

ఆఖరికి తనపంతం, తనఅన్నగారిపంతం నెగ్గేయి. చదువులకి చెన్నపట్ణం వెళ్లింది.

ఎప్పుడుచెన్నపట్ణంవెళ్లినా తనఅన్నగారు తీసుకువెళ్తూఉండేవాడు. ఎప్పుడుశలవలువచ్చినా అన్నగారు చెన్నపట్ణంవచ్చి ఇంటికితీసుకువస్తూఉండేవాడు. మొదటిసారి తనతల్లికూడా చెన్నపట్నంవచ్చింది. ఆసారి వాళ్లిద్దరూ తనని శరణాలయంలో వదిలిపెట్టి వెళ్లిపోతున్నప్పుడు పట్టరానిదుఃఖంవచ్చింది. పైకిఏడ్చేస్తే తల్లి మళ్లీతీసుకువెళ్లిపోతుందేమోనన్నభయంతో తనదుఃఖం ఆపుకుంది. వాళ్లు వెళ్లిపోయాక రాత్రంతా ఏడుస్తూ గడిపింది.

రానురాను ఆహోస్టల్‌లో మిగిలినపిల్లలతో సరదాగాకాలక్షేపంచేస్తూ తనదుఃఖాలన్నీ మరచిపోయింది. ఒకటిరెండుసార్లు జ్వరంతగిలినప్పుడూ మరికొన్ని కష్టసమయాలలోనూ శరణాలయంలోఉన్న పెద్దలు స్వంతతల్లులలాగ తనకి ఉపచారం చెయ్యడంవల్ల ఆశరణాలయాన్ని స్వంతగృహంతర్వాత మరొకస్వంతగృహంలా చూసుకునేది

ఈలోపున తనకి చదువులలో సహజమైన అభిలాషఉండడంవల్ల ప్రతిసంవత్సరం పరీక్షలలో సులభంగా ఉత్తీర్ణురాలయేది. పదహారేళ్లు నిండకుండానే మెట్రిక్యులేషన్‌పరీక్షలో జయంపొందింది. మరుసటిసంవత్సరం మేరీరాణీకళాశాలలోఉండి ఇంటర్‌మీడియట్ చదువులు ప్రారంభించింది.

ఆ సంవత్సరమే తనబావ, నారాయణరావుకూడా రాజధానికళాశాలలో గణితశాస్త్రపు ఆనర్సుతరగతిలో ప్రవేశించాడు. నారాయణరావుకి సీతనిఇచ్చి పెళ్లిచేసేటట్టు స్థిరపడింది. సీతతండ్రి సీతకి పదహారేళ్లు నిండేవరకూ పెళ్లిచెయ్యననడంవల్ల పెళ్లికానప్పటికీ, అవబోయేమామగారిదగ్గర డబ్బుపుచ్చుకుని నారాయణరావుచదువులకి చెన్నపట్నంవచ్చాడు. ప్రతీనెలా ఆయనే నారాయణరావుకి డబ్బు పంపిస్తూ ఉండేవారు.

నారాయణరావు తనని చూడడానికి అప్పుడప్పుడు వస్తూఉండేవాడు. మొదటిసంవత్సరం నెలకో, రెండునెలలకో ఒకసారివచ్చేవాడు, అయిదునిముషాలో పదినిముషాలో ఉండి, కుశలప్రశ్నలుమాత్రంవేసి వెళ్లిపోతూఉండేవాడు. ఆసమయాలలోఅతని కెంతసిగ్గుగా ఉండేదో తనకిగూడా అంతసిగ్గుగానూ ఉండేది. అతను వచ్చి వెళ్ళిపోయినప్రతిసారీ కూర్చుని తనతల్లికి "ఈ వాళ నన్ను చూడడానికి నారాయణరావుబావ మాహాస్టల్‌కివచ్చాడు" అని ఉత్తరం వ్రాస్తూఉండేది. రెండవ సంవత్సరం మొదటినాలుగైదునెలలూ పూర్వంలాగే ఎప్పుడోకాని తనని చూడడానికి నారాయణరావు వచ్చేవాడుకాదు. నాలుగైదునెలలయాక రాజధానికళాశాలలో విద్యార్థులు ఇంగ్లీషులో ఒకనాటకం వేసేరు. ఆనాటకంలో నారాయణరావు దొక ప్రధానపాత్ర. నారాయణరావు తనతో ఆమాటఎన్నడూ చెప్పలేదు. రాజధానికళాశాలలో నాటకంచూడడానికి మేరీరాణీకళాశాలలోని విద్యార్థినులు చాలామంది వెళ్లేరు. తనుగూడా వెళ్లింది. నాటకరంగంమీద నారాయణరావుని చూడగానే చాలాఆశ్చర్యపడింది. చూడగానే తనతోఅతను దీనిమాట చెప్పలేదని చాలా కోపగించుకుంది. కాని నాటకంజరుగుతున్నకొలదీ ఆకోపం ఆశ్చర్యం మరచిపోయి, అతని నటనకౌశల్యంచూసి చాలా ఆనందించింది. చూడడానికి వచ్చినవాళ్లందరూ అతనిపాత్రపోషణ మెచ్చుకుని చప్పట్లుకొట్టుంటే ఆచప్పట్లన్నీ తనకేఅన్నట్టు ఉప్పొంగిపోయింది. తనపక్కన కూర్చున్న ఆడపిల్లలతో "అతను నా మేనమామకొడుకు" అని మళ్లీమళ్లీ చెప్పింది. ఆరాత్రి తను హాస్టల్‌చేరుకోగానే భోజనంచేసి గదికివెళ్లి నారాయణరావుకి ఒక పెద్దఉత్తరంవ్రాసి రాత్రికిరాత్రే తపాలాపెట్టెలో పడేసింది. ఉత్తరంలో నారాయణరావుని నాటకం సంగతి తనకి చెప్పకుండా దాచినందుకు కోప్పడింది. నాటకంలో అతనిపాత్రధారణ చాలాబాగున్నందుకు అతన్నిపొగిడింది. అతను తనకి బావఅవడంవల్ల తను చాలాగర్వపడుతున్నానంది. తను బతికిఉన్నంత కాలమూ ఆనాటకాన్నీ, అతనిపాత్రపోషణనీ ఎన్నడూ మరచిపోలేనంది. మొన్నాడు తనని చూడడానికి నారాయణరావు మేరీరాణీకళాశాలకి వచ్చాడు. ముందటిరాత్రి ఎదురుగుండాకూర్చున్న ఆడపిల్లలలో వెంటనే అతనికి

తను కంటబడినట్టు చెప్పేడు. నాటకం జరుగుతున్నంత సేపూ తను అతిసంతోషంగా ఉండడం చూసేనన్నాడు. రాత్రికిరాత్రే తనుపొగుడుతూ ఉత్తరంవ్రాయడం అతనికి చాలా ఆనందం కలుగజేసిం దన్నాడు.

అప్పటినుంచి తననిచూడడానికి నారాయణరావు తరచుగా వస్తూఉండేవాడు. అతను వచ్చినప్పుడల్లా అతన్ను వచ్చాడని తల్లికివ్రాయడం మానుకుంది. కొంత కాలం ఉత్తరాలలో అతనిపేరు ఎత్తడం మానేసింది. దానితోకూడా సంతృప్తిలేక, అతను ఇప్పుడిప్పుడు వారానికి అధమం రెండుసార్లు వస్తున్నాకూడా, అబద్ధం ఆడుతూ, "నారాయణరావుబావ నన్ను చూడడానికి వచ్చి రమారమి మూడునెలలయింది." అంటూ తల్లికి వ్రాసేది.

తను ఇంటర్‌మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణురాలయింది. మేరీరాణీకళాశాలలోనే బి. ఏ. తరగతిలో ప్రవేశించింది. సంవత్సరం మొదలులోనే తన నాయనమ్మ చచ్చిపోయిందని ఉత్తరంవచ్చింది. అన్నగారు రావద్దనివ్రాసినా వెళ్లడానికి ప్రయత్నం చెయ్యబోయి మళ్లీమానేసింది. నారాయణరావు ఎప్పటిలాగే తనని చూడడానికి వారానికి రెండుసార్లు వచ్చేవాడు దానికి తోడు అప్పుడప్పుడు అతను తనకి ఉత్తరాలు వ్రాయడం తను అతనికి ఉత్తరాలు వ్రాయడం కూడా జరిగేది. నారాయణరావుమీద తనకి ప్రేమ రోజు రోజుకీ వృద్ధవుతోంది. నారాయణరావు సీతని పెళ్లిచేసుకోవాలని తనకితెలుసును. కాని నారాయణరావు తనతో ఇంతవరకు సీతగురించికాని పెళ్లిగురించికాని ఎన్నడూ మాట్లాడలేదు. ఒకరోజున అతనితో ఈ విషయమై మాట్లాడుదామని నిశ్చయించుకుంది. అతనితో కూర్చుని మిగిలినసంగతులు మాట్లాడుతుంటే ఈ పెళ్లిప్రశ్నలు వెయ్యడానికిమట్టుకు తనకి ధైర్యంచాలలేదు. అతను వెళ్లిపోయాడు. ఆఖరికి ఆరాత్రి అతనికి ఈవిషయమై ఉత్తరం వ్రాయడానికి స్థిరపరచుకుంది. మూడునాలుగు సార్లు ఉత్తరం మరీపెద్దదిగావ్రాసి చీకాకుపడి చింపేస్తూ వచ్చింది. అతనిపెళ్లివిషయమై తను ఇంత ఆదుర్దాపడుతున్నట్టుచూసి అతను ఏమనుకుంటాడో అని భయపడింది. 'ఈప్రశ్నలన్నీ అతన్ని అడిగేందుకు నాకు హక్కేమిటి?' అని తనలోతను చర్చచేసుకుంది. ఉత్తరం వ్రాయకూడదనుకుంది. ఊరుకుంది. కాని మరొక గంట ఈపనీ, ఆపనీచేసివచ్చి కూర్చుని ఆఖరికి ఈ విధంగా అతనికొక ఉత్తరంవ్రాసి టపాలోవేసింది: "అన్నట్టు ఈవాళసాయంత్రం నిన్నొకప్రశ్న అడుగుదామనుకుంటూ మరచిపోయాను. మళ్లీ మరచిపోతానేమోనని వెంటనే ఉత్తరంవ్రాస్తున్నాను. నువ్వు మాచెల్లెలు సీతని పెళ్లిచేసుకోడం నిశ్చయం అయినట్టేనా? నిశ్చయమే అయితే, మీపెళ్లి ఎప్పుడు?"

ఈప్రశ్నలకి తనకొక పెద్దజవాబువ్రాసి పంపించాడతను. అతనికి సీతని పెళ్లిచేసుకోవాలన్న అభిలాష ఎన్నడూలేదని వ్రాశాడు కాని సీతని పెళ్లిచేసుకోకుండా ఉంటే చాలాచిక్కులకి పాలవుతానని వ్రాశాడు. అతని అన్న శివరావుకి చాలాకోపం వస్తుందన్నాడు. అదికాక, ఇన్నాళ్లూ అతనిచదువులకి సీతతండ్రే డబ్బుపంపిస్తూఉండడం ఒకచిక్కైనవిషయం అన్నాడు. ఏదిఎలాఉన్నా, సీతని పెళ్లిచేసుకోకుండా ఉండేందుకు సకలప్రయత్నాలూ చేస్తానన్నాడు. సీతని పెళ్లిచేసుకోవాలన్న అభిలాష ఇప్పుడు ముఖ్యంగా అతనికి లేకుండాఉండేందుకు కారణం తను బోధపరచమంటే తర్వాత తనకి బోధపరుస్తానని వ్రాశాడు... అతనిఉత్తరం చదువుకుని చాలాఆనందించింది. అతను వ్రాయడానికి సందేహించినకారణం ఏమిటో తను గ్రహించింది. గ్రహించి ఉప్పొంగిపోయింది. మొన్నాడు అతనువచ్చినప్పుడు నవ్వుతూ ఆకారణంఏమిటో చెప్పమని అడిగింది. అతను కంగారుపడ్డాడు. సిగ్గుపడ్డాడు. చెప్పలేక పోయాడు. ఆనాడు వెళ్లిపోయి కారణం బోధపరుస్తూ ఉత్తరం వ్రాసిపంపించాడు. అతని ఉత్తరం చదువుకుంటూ తను ఆనందపరవశురాలైపోయింది ఇన్నాళ్లకి ఈఉత్తరంలో అతనికి తనమీద ఉన్న ప్రేమఅంతా తెలియపరిచాడు. ఎప్పటికైనా పెళ్లిచేసుకుంటే తననేపెళ్లి చేసుకుంటానని వాగ్దానంచేసేడు. ఆ ఉత్తరానికి అతనికి తను జవాబువ్రాయలేదు. దానికి జవాబు ఎలావ్రాయాలో తనకి బోధపడలేదు. నాలు

గైదురోజులయాక అతను మళ్ళీ తనహాస్టల్‌కివచ్చాడు. ఇన్నాళ్ళకి మళ్ళీ ఇద్దరూ కొత్తగా ఒకరినొకరు చూసుకుంటూ సిగ్గుపడిపోయారు. ధారాళంగా మాట్లాడలేకపోయారు. ఆఖరికి తనేఅతనితో అతనిఉత్తరం అందించని చెప్పింది. జవాబువ్రాయలేదేమని అతను చిన్నబుచ్చుకుంటూఅడిగేడు. ఏవిధంగావ్రాసేందుకూ తనకి స్ఫురించలేదనిచెప్పింది. తనమూలంగా అతనుఅతనిఅన్నగారితో కాని,సీతతండ్రితో కాని చిక్కులలోపడడం తనకి ఇష్టం లేదని చెప్పింది. మరేమీ పరవాలేదన్నాడతను. పరీక్షలయిపోయాక వేసంగికి ఇంటికివెళ్ళిపోయినప్పుడు అతని అన్నకి అన్నిసంగతులూ బోధపరుస్తానన్నాడు. అన్నగారు అతనిఉద్దేశ్యాలతో ఏకీభవించేటట్టు చెయ్యగలనన్నాడు. ఏమాత్రమూ సందేహంలేదన్నాడు. అతను అంతధైర్యంగా మాట్లాడుతుంటే తనకిగూడా ధైర్యం కల్గింది. అతనుపట్టినపట్టు నెగ్గుకుంటే తనజన్మ ముఖ్యంగా సార్థకంఅవుతుం దనుకుంది. ఆనందించింది. ఆ సంవత్సరం ఆఖరిఅయిదారు నెలలూ అతివులాసాగా గడిపింది. ఆసంవత్సరం అతనికి పెద్దపరీక్ష అవడంవల్ల అతన్ని మరీతరచుగా తనకోసంవచ్చి నష్టపోవద్దని అనేకసార్లు బ్రతిమాలుకుంది. అతను వినలేదు. పూర్వం అంత తరచుగానూ వచ్చేవాడు. పూర్వంకంటే ఎక్కువ తరచుగా ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడు. పూర్వం కంటె నాలుగైదింతలు పెద్దఉత్తరాలు వ్రాసేవాడు. ఆఉత్తరాలన్నీ తను జాగ్రత్తగా దాచుకునేది. మళ్ళీమళ్ళీ వాటిని పెట్టెలోంచి పైకితీసి చదువుకుంటూవుండేది.కొన్నాళ్ళయాక అతనిఫోటోఒకటి తనకిమ్మని పోరింది. ఇచ్చాడు. తనఫోటో ఒకటి అతనికిచ్చింది. పడుకోబోయేముందు అతనిఫోటో ఒకసారి చూస్తేకాని పడుకునేదికాదు. తెల్లవారగట్ట లేవగానే మళ్ళీ అతని ఫోటో చూస్తే కాని మరేపనీ చేసేదికాదు. అతనిగురించి ఆ లో చిం చ ని ఘడియ లేదు. అతనిగురించి ఆ లో చిం చ ని నిముషం లేదు. ఇంతలో అతనిపరీక్షలు ప్రారంభం అయాయి. పరీక్షలలో ప్రతిరోజూ అతనికి ధైర్యంచెప్తూ ఉత్తరం వ్రాసేది. తనస్వంతపరీక్షలకైనా ఎన్నడూ అంత బెంగపెట్టుకోలేదు. పరీక్షలయిపోయాక ఊరికిబయలుదేరేనాడు సాయంత్రం అతనువచ్చాడు.మళ్ళీ చెప్పిందితనకోసమని అతను కష్టాలుతెచ్చిపెట్టుకోగూడదని. ఎన్నికష్టాలుసంభవించినా లొంగదలచుకోలేదని చెప్పేడతను. ఆఖరినిముషాన్ని 'ఇతను మాటనిలబెట్టుకోగలుగుతాడాలేదా' అని సందేహించింది. మళ్ళీ ఈవిషయంలో అతను సామర్థ్యం లేనివాడు కాడనుకుంది. అతని అన్నగారితో మాట్లాడి వెంటనే తనకి ఉత్తరంవ్రాస్తానన్నాడు. ఈశెలవలలో అతనికి తనదగ్గరనుంచిమట్టుకు ఉత్తరాలేవీ రాకూడదన్నాడు. అతను వ్రాయమని వ్రాసేవరకూ ఏమీ వ్రాయవద్దన్నాడు. సరేనంది.

అతను వెళ్ళిపోయాడు. మరొక రెండుమూడు రోజులలో తనుకూడా తనఊరు జేరుకుంది. అక్కడ తనకి ఏమీతోచలేదు. నారాయణరావు అన్నగారితో వాదిస్తూ ఏమిబాధలుపడుతున్నాడో అని బెంగపెట్టుకుంది. పదిపదిహేనురోజులయాక ప్రతిరోజూ అతని ఉత్తరానికి ఎదురుచూస్తూకూర్చుంది. ఎప్పటికీరాలేదు. మరీబెంగపెట్టుకుంది. నెలరోజులయాక అతను పరీక్షలో ఉత్తీర్ణుడయాడని వార్తాపత్రికలలోచూసింది. వెంటనే అతనికి ఉత్తరంవ్రాయాలని బుద్ధిపుట్టింది. కాని అతను వద్దనడం జ్ఞాపకంతెచ్చుకుని వ్రాయడం మానుకుంది. ఇప్పుడైనా అతను తప్పకుండా ఉత్తరం వ్రాస్తాడనుకుంది. మరొకపదిరోజులుచూసింది. అప్పటికీ ఉత్తరంరాలేదు. విసుక్కుంది. దుఃఖపడింది.రాత్రుళ్ళు ఏడుస్తూగడిపింది. ఒకరోజునకూర్చుని అతనినిర్లక్ష్యానికి నిందిస్తూ, తనప్రేమ ఎంతనిర్మలమైనదో, ఎంత మేరలేనిదో అతనికిబోధపరుస్తూ అతనివాగ్దానం అతనికి జ్ఞాపకంచేస్తూ ఒకపెద్దఉత్తరంవ్రాసి టపాలోవేసింది. దాన్ని టపాలోవేసిన మూడవరోజున మధ్యాహ్నం భోజనాలుచేసి కూర్చున్నాక తనఅన్నగారికి సీత తండ్రివద్దనుండీ, శివరావువద్దనుండీరెండుపెళ్ళిశుభలేఖలు వచ్చాయి సీతకి నారాయణరావునిచ్చి మరొకనాలుగు రోజులలోపెళ్ళి! తనతల్లి ఆపెళ్ళికబురు విని సంతోషంగా "పోనీ, ఇన్నేళ్ళబట్టి అనుకుంటున్న సంబంధం తప్పిపోకుండా ఉండడంచాలాగొప్పమాట.మంచికబురే.

శుభం!" అంది. తనఅన్నగారు పెళ్లికి వెళ్లేందుకు బట్టలూ గట్రా సర్దుకోవాలన్నాడు. 'తనుకూడా పెళ్లికి వస్తుందా?' అని అడిగేడు. తనురానని జవాబిచ్చింది. ఆకబురు తెలిసిన రెండుమూడుగంటలవరకూ లోకం అంతా ఏదోఒక పెద్దతుపానులో కొట్టుకుపోతున్నట్టు అనిపించింది తనకి. ఎటుపక్క చూసినా దుఃఖమే. ఏవిధంగా ఆలోచించినా నిరాశే. ఆనిరాశ తనకేకాదు. సృష్టికంతటికీ. కళ్లు కప్పుకుపోయాయి. మెదడు నశించింది. నరాలబలం పోయింది. చచ్చిపోతున్నానేమో అనుకుంది. తల్లి కాచి దగ్గరతెచ్చిపెట్టిన కాఫీ ముట్టుకోలేదు. మతిలేదు. చల్లారిపోయిన కాఫీ తల్లి వెచ్చబెట్టి మళ్లీ తెచ్చేవరకూ తాగలేదు. వెంటనే ఆత్మహత్యచేసుకోవాలని ఎందుకు తనకి బుద్ధిపుట్టడంలేదో అని ఆశ్చర్యపడింది. లేచి మూలగదిలో తలుపులూ కిటికీలూ దగ్గరగా వేసేసుకుని చీకట్లో మంచంమీద పడుకుంది. తన అన్నగారు వచ్చి 'జ్వరంవచ్చేటట్టుందా?' అని అడిగేడు. చాలా తలనొప్పిగా ఉందని చెప్పింది. మాత్రలుతెచ్చిఇచ్చాడతను. వాటిని మింగింది. పడుకుని ఏడవడం మొదలుపెట్టింది. ఏడవకపోతే ఆదుఃఖంతో గుండె బద్దలయిపోతుందేమో· అన్నంతబాధ అనుభవించింది. తల్లికి ఏమీ బోధపడకపోయినా, ఆవిడ వచ్చి ఓదార్చబోయింది. తల్లివచ్చి పక్కలో కూర్చోగానే దుఃఖం అణచుకోడానికి కొంచెమైనా ప్రయత్నించకుండా మరీపెద్దపెట్టున ఏడుస్తూ పడుకుంది. తన అన్నగారు తడిగుడ్డతెచ్చి నుదురుమీదపెట్టి గుడ్డని తడుపుతూ విసనకర్రతో విసురుతూ నుంచున్నాడు. తనకి లోకంలో మిగిలినది వీళ్లిద్దరే అనుకుంది......కాని నారాయణరావులేని జీవితానికి వీళ్లుండిమట్టుకు ఏమి ప్రయోజనం?

తనుకొంచెం ఏడుపుమాని కళ్లుమూసుకునేసరికి తల్లీ, అన్నగారూ తనుశోషవచ్చి నిద్రపోతోందనుకున్నారు. "సీతపెళ్లికబురు వచ్చినప్పటినుంచీ దాని ముఖంచూస్తున్నానురా. ఏమీలేదు. అందరూ నిక్షేపంలా పచ్చగాఉంటుంటే తనకర్మం ఇలాఉందికదా అని ఏడుస్తోంది. నేను భయపడుతూనేఉన్నాను. ఎవరం మట్టుకు ఏమిటిచెయ్యగలం? దానినుదుటా, నానుదుటా అలావ్రాసిపెట్టేడు ఆదుర్మార్గపుదేవుడు" అంటూ తల్లి ఏడుస్తోంది. "ఏడవకమ్మా. నువ్వుకూడా ఏడిస్తేఎలాగ? చెల్లాయి వింటోందేమోకూడా మానుమరి, మాను" అంటూ అన్నగారు నెమ్మదిగా నచ్చచెప్తున్నాడు తల్లికి. ఆ మాటలు విని, తను ఎంతదుఃఖపడుతున్నా, పాపం, వీళ్లని దుఃఖపెట్టకూడదనుకుంది. నిద్రపోతున్నట్టు నటిస్తున్నది. ఇంకా నిద్రపోతున్నట్టే నటించింది. ఆఖరికి నిజంగా నిద్రపోయిందికూడాను.

మళ్లీ రాత్రి ఎనిమిదిగంటలప్రాంతాన లేచింది. తల్లి అడిగితే అన్నంతిననంది. కాఫీమట్టుకు తాగి పడుకుంటానంది. చన్నీళ్లతో ముఖంకడుక్కునివచ్చి కాఫీ తాగి మళ్లీ పక్కలోపడుకుంది. ఇప్పుడు కొంచెం నిశ్చలమైనమనస్సుతో అన్నిసంగతులగురించీ ఆలోచించడం మొదలుపెట్టింది. నారాయణరావు అతనిఅన్నగారిమాట జవదాటలేకపోయాడన్నమాట. అతనిగురించి ఆ భయం తనకి మొదటినుంచీ ఉన్నదేకదా అనుకుంది. అంత ఆశ్చర్యపడవలసిన కారణం లేదనుకుంది. ఆశపెట్టుకోడం పూర్తిగా తన తెలివితక్కువే. ఇంతట్లో చటుక్కున తనురెండురోజులక్రిందట నారాయణరావుకి వ్రాసిన ఉత్తరం జ్ఞాపకంతెచ్చుకుంది. 'అది ఎందుకువ్రాశానో కదా! ఎందుకువ్రాశానోకదా!' అని లక్షసార్లు అనుకుంది. లక్షసార్లు సిగ్గుపడింది. అలా ఆవిషయమై సిగ్గుపడుతూఉండగానే మళ్లీ తన అంతరించని ఆశలు తలలు పైకెత్తేయి. తనఉత్తరంచూసుకుని నారాయణరావు ఆఖరినిముషాన్ని సీతని పెళ్లాడడం మానేస్తాడేమో!... ......వెర్రి ఊహలు! ఆదుస్థితిలో తనంటే తనకే జాలి కలిగింది. నారాయణరావు మనోబలం లేనివాడు. అతని అన్నదగ్గర అతను ఎదురుమాట చెప్పలేకపోయాడు. అతను స్వయంగా ఇచ్చిన వాగ్దానాలనీ, తన సంపూర్ణమైనప్రేమనీ గడ్డిపరకలలా తోసిపారేశాడు. ఇకమ తను చెయ్యగలిగినదేమీలేదు. అతన్ని మరచిపోవడానికి ప్రయత్నించాలి. కాని.........ఎలా మరచిపోవడం?

తనఅన్నగారు నారాయణరావుపెళ్లికి వెళ్లేడు. సరిగ్గా నారాయణరావు పెళ్లిముహూర్తంవేళ ఇక్కడ

తను నారాయణరావు తనకి వ్రాసిన ఉ త్త రా లూ, నారాయణరావు తనకిచ్చిన ఫోటో చింపెయ్యడానికి నిశ్చయించుకుంది. గడియారంచూసి సరియైనవేళకి రహస్యంగాతన పెట్టెతెరిచి ఆ ఉత్తరాలూ, ఆఫోటో పైకి తీసింది. ఫోటో చింపబోయింది. మన్యని అంగుళంలో పదోవంతు చింపి చటుక్కునమానేసింది. ఆపైని చింపేందుకు చేతులురాలేదు. పిచ్చిగా ఆబొమ్మని ముద్దుపెట్టుకుంది. ఎన్నడూ దానిని చింపడానికి ప్రయత్నించకూడదనుకుంది. ఈనారాయణరావే వేరు! ఇప్పటి నారాయణరావు కాదు!

ఆఉత్తరాలన్నీ తీసిచదువుకుంది...సీతకి ఇప్పుడే పుస్తెకట్టా ఉంటాడు!...కాని ఏమి ఉత్తరాలవి! ఏమి ఉ త్త రా లు! తనమీద నిజంగా అఖండమైన ప్రే మ లే ని వా డు ఇటువంటి ఉత్తరాలు వ్రాయగలుగుదుడా? ఒక ఉత్తరంలో తమరు ఎన్నడూ ముద్దుపెట్టుకోలేదని విచారపడుతూ వ్రాశాడు. ఇంకఎన్నడూ ముద్దుపెట్టుకోడం ఉండదు కదా!...సీతకి పుస్తెకట్టడం అయిపోయుంటుందా? అయిపోయే ఉంటుంది...ఫోటోనీ, ఉత్తరాలనీ పెట్టెలో పడేసింది. పడేసి, ఒకసారి ఫోటోనిమట్టుకు మళ్లీ పైకితీసి చింపినభాగాన్ని ముద్దుపెట్టుకుని లోపలపడేసి పెట్టెకి తాళంవేసింది.

అన్నగారువచ్చి పెళ్లిసంగతులన్నీ చెప్పేడు. శివరావుకీ, సీతతండ్రికీ జరిగిన పోట్లాటలన్నీ వర్ణించాడు. నవ్వుతూ వింది. శివరావు తమ్ముడిచేత అలకరోజున మోటారుకారు అడిగింపించాడట. విని, అతినిర్లక్ష్యంగా, "మోటారుకారుకాదు, ముదొంకాయ!" అన్నాడట సీతతండ్రి. ఈకథలన్నీ ఎవరిపెళ్లిగురించో అన్నట్టు వింటూకూర్చుంది తను. ఇంతట్లో తనఅన్నగారు నారాయణరావు తనుపెళ్లికి రానందుకు చాలావిచారించాడనీ, మళ్లీమళ్లీ తనురాకపోవడం గురించి ప్రశ్నలువేసేడనీ చెప్పేడు. నారాయణరావు తన అన్నగారితో తన గురించి మాట్లాడకుండా ఉంటుంటే బాగుండు ననుకుంది.—ఎందువల్లనో! ఇంతకీ నారాయణరావు తన మాట మరచిపోలేదన్నమాట. ఎలామరచిపోతాడు?... తనఉత్తరం అందిందో లేదో? ఒకవేళ ఏకారణంవల్లనైనా పెళ్లిరోజున అందిందేమో? లేకపోతే, కొంప తీసి, మరిఎవరిచేతులల్లోనైనా పడిందేమో?

శలవలుకాగానే చదువులకి చెన్నపట్నంవెళ్లిపోయింది. ఆసంవత్సరం నారాయణరావు చెన్నపట్నంరాలేదు. అతనికబురు తనకి అప్పుడప్పుడు తెలుస్తూనేఉండేది. పెళ్లయిన తర్వాత భార్యతో ఆరు నెలలు మామగారిఇంట్లోనే ఉన్నాడు. ఎక్కడికీ కదలలేదతను. ఆతర్వాత ఉత్తరహిందూస్థానంలో ఎక్కడో ఉన్నాడని తనకితెలిసింది. భార్యని అతనితో తీసుకువెళ్లలేదు. ఉత్తరహిందూస్థానం ఎప్పుడువదిలేడో మట్టుకు తనకి తెలియలేదు. మొదట తను చెన్నపట్నం రాగానే తనకిఅతను ఉత్తరం వ్రాస్తాడనుకుంది. వ్రాయలేదు. తర్వాత ఉత్తరహిందూస్థానంలో భార్య అతనితో లేనప్పుడు అతను తనకి ఉత్తరం వ్రాస్తాడేమోనని ఆశపడింది. అప్పటికీ వ్రాయలేదు. పూర్వం అతను తనకి వ్రాసినఉత్తరాలే చదువుకుంటూ కాలం వెళ్లబుచ్చింది. ఆఉత్తరాలు చదువుకుంటుంటే తనమీద అతనికి ఒకానొకప్పుడున్న ప్రేమ ఎన్నటికీ నశించదని ఒకవెర్రిధైర్యం కలిగేది. ఆవెర్రిధైర్యం రానురాను దృఢనమ్మకం అయిపోయింది. అతను అన్నగారికి ఎదురుతిరగలేక సీతని పెళ్లిచేసుకున్నాడుకాని, నిజంగా అతనికి ఇంకా తనమీదే అగాధమైనప్రేమ అని నిశ్చయించుకుంది. ఒకరిని ప్రేమిస్తూ మరొకరిని పెళ్లిచేసుకోవలసివచ్చిన అతని జీవితంగురించి ఆలోచిస్తూ చాలా జాలిపడేది. అతనికి మనోబలం చాలకపోవడంవల్ల తమఇద్దరిజీవితాలూ కృత్రిమపుజీవితాలయిపోయాయని అనుకుంటూ ఉండేది.

ఆఏడు తనపెద్దపరీక్ష. పరీక్ష పదిహేనురోజులనగా నారాయణరావు చెన్నపట్నం వచ్చాడని తనకి తెలిసింది. మనస్సు కెలికేసినట్టు అయిపోయింది. తనకోసం వస్తాడేమోనని ఒక్కొక్కప్పుడు ఆశ. తనకోసంవస్తాడేమోనని ఒక్కొక్కప్పుడు భయం. కాని అతనురాలేదు. ఈఆదుర్దాలో తను పరీక్షకి సమంగా చదువుకోలేదు. పరీక్షంతా అయాక ఆఏడు పోతుం

దేమోనని భయపడింది. ఒకరాత్రంతా కూర్చుని ఏడ్చిందికూడాను.

తన ఊరికి బయల్దేరింది. రాజమహేంద్రవరం స్టేషన్‌లో రైలుకిటికీలోంచి తొంగిచూస్తుంటే ఒక మూల పచార్లు చేస్తున్నస్వరూపం నారాయణరావులా కనిపించింది. తనగుండె దడదడ కొట్టుకోడం ప్రారంభించింది. అతను చూసేస్తాడేమోనని భయపడింది. రైలు బండిలో రెండవవైపుకి వెళ్లిపోయి కనబడకుండా వంగి కూర్చుంది. రైలు కదులుతుంటే మళ్లీ అది నిజంగా అతనవునో కాదో చూడాలని బుద్ధిపుట్టింది. చూసింది. అతనే. తనకేసి చూడలేదతను. కానిఆస్వరూపం అతనిదే. పెళ్లయాక కొంచెంలావుగామట్టుకు మారేడు.

అయిదారు వారాలయాక తను పరీక్షలో ఉత్తీర్ణురాలయినట్టు వార్తాపత్రికలో చూసుకుంది. తన అన్నగారు ఆనందించాడు. తల్లికూడా చాలాగర్వపడింది. ఊళ్లో ఎరుగున్నవాళ్లందరూ వచ్చి తన తెలివితేటలు పొగడడం మొదలుపెట్టేరు. అప్పటికైనా తను జయం పొందడంవల్ల తనకి ఏవిధమైన ఉత్సాహమూ కలగలేదు. రెండురోజులయాక ఎన్నడూ అనుకోనిది నారాయణరావుదగ్గరనుంచి తను పరీక్షలో ఉత్తీర్ణురాలయినందుకు అతనిసంతోషం తెలియపరుస్తూ ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలోనే సీతకూడా ఆవిషయమై తన ఆనందం తెలియపరుస్తూ వ్రాసింది. దానికి ఏమీజవాబివ్వలేదతను. ఆ ఉత్తరం వచ్చిననాడుమట్టుకు రాత్రి మామూలు వేళకి తనకి నిద్రపట్టలేదు.

నారాయణరావు ఉత్తరం వచ్చినరెండువారాలకే నారాయణరావు చచ్చిపోయాడన్న దుర్వార్త తనచెవిని పడింది. ఒక్కక్షణంలో ఏవిధంగానో మేఘంలేని ఆకాశంనుంచి పిడుగుపడినట్లయింది. కాని వెంటనే తనుదుఃఖపడవలసినంత దుఃఖపడలేదు. ఆసంగతి తనుకూడా గ్రహించింది. గ్రహించి సిగ్గుపడింది సీతమొగుడైన నారాయణరావు చచ్చిపోయినట్టు భావించుకుంది కాని తనకి ముఖ్యుడైన నారాయణరావు చచ్చిపోయినట్టు భావించుకోలేదప్పుడు. కొంతసేపయాక నారాయణరావుముఖం మళ్లీ తనకంటబడదని ఆలోచించుకుంటూ చాలాదుఃఖపడింది. ఆఖరిసారి అతన్ని రాజమహేంద్రవరం స్టేషన్‌లో చూడడం జ్ఞాపకం తెచ్చుకుంది. అతన్ని అప్పుడు పిలిచి మాట్లాడలేదని ఇప్పుడు విచారించడం మొదలుపెట్టింది. ఆరాత్రి అతని ఉత్తరాలన్నీ రహస్యంగాతీసి అతనువ్రాసిన ప్రతిపంక్తీ చదివింది. ఆతని ఫోటోని విసుగులేకుండా అనేకసార్లు ముద్దుపెట్టుకుంది. ఏడ్చింది......ఆరాత్రిపడుకుంటూ మళ్లీ నారాయణరావు చచ్చిపోవడం అంత మరీవిచారకరమైనవిషయం కాదని ఆలోచించింది. అయిష్టంగా సీతని పెళ్లిచేసుకున్నాడతను. చచ్చిపోవడంవల్ల అతనికి విముక్తివచ్చింది. అదికాక చచ్చిపోవడంవల్ల పూర్తిగా మళ్లీ అతను తనవాడైపోయాడు.

మొన్నాడు తనూ, తనతల్లీ కలిసి సీతని పరామర్శచెయ్యడానికి సీతతండ్రి ఉద్యోగంచేస్తున్న ఊరికి వెళ్లేరు. తన పినతల్లి వీరభద్రమ్మ వీథిగుమ్మంలో అక్కని కౌగలించుకుని గొల్లుమని ఏడ్చింది. సీతతండ్రి వీథి సావిట్లో మతిపోయినవాడిలా కూర్చుని వచ్చినవాళ్లని చూసి లేవనైనా లేవలేదు. సీత లోపలిగదిలో ఒక మంచంమీద పడుకుని ఉంది. వీరభద్రమ్మపిన్నీ, తనతల్లీ, తనూ ఆగదిలోకి ప్రవేశించడం సీతచూసింది. గోడవైపుకి ఒత్తిగిల్లి తలగడాలో తలదాచుకుని ఏడవడం మొదలుపెట్టిందిసీత. తనువెళ్లి ఆప్రక్కలోనే కూర్చుని మాట్లాడకుండా సీతచేతులు పట్టుకుని మృదువుగా వాటిని తడుముతూ ఓదార్చబోయింది. తనతల్లి నేలమీద చతికిలబడి వీరభద్రమ్మపిన్నికేసిచూసి కన్నీరు ధారలుగా కారుస్తూ "అమ్మో్య, చెల్లీ, నాకే ఈకర్మం అనుకుంటుంటే నీకుకూడా ఈకర్మమే పట్టిందేమే! నువ్వేమి పాపంచేసుకున్నావే? ఏజన్మలో ఎవరికి అపరాధంచేసేవే?" అంటూ ఏడ్చింది. తనతల్లి ఏడవడం, తనపినతల్లి ఏడవడం, సీత ఏడవడం చూస్తూ కూర్చుంటే, మొదట రాని కన్నీరు తనకిగూడా గంగాప్రవాహంలా వచ్చేసింది. కాసేపయాక తనతల్లీ, పినతల్లీ గదిలోంచి వెళ్లిపోయారు. తనూసీతా మిగిలేరు. సీత లేచికూర్చునికళ్లుతుడుచుకుంటూ జుట్టుముడివేసుకుంటూ "కాసిని మంచినీళ్లు తెచ్చిపెట్టక్కయ్యా" అంది. తను

వెళ్ళి మంచినీళ్లు తెచ్చింది. మంచినీళ్లుతాగి సీత మళ్లీ ఏడుపు మొదలుపెట్టింది. తనకి మాట్లాడేందుకేమీ తోచలేదు. ఇంతట్లో పరామర్శ చెయ్యడానికి ఎవరో తను ఎరగనివాళ్లు వచ్చారు. పక్కలోకూర్చున్న సీత మళ్లీపడుకుని గోడవైపుకి ముఖంపెట్టేసింది. "చిన్నపిల్ల, పాపం. ఏడాదైనా కాపురంచేసిందా మొగుడితో?" అం దావిడెవరో. పరామర్శకి వచ్చినవాళ్లు సీతఎదురుగుండా ఇటువంటిప్రశ్నలు వెయ్యడం తనకేమీ నచ్చలేదు. ఇంతట్లో తనపినతల్లి ఒకమూల ఏడుస్తూనే "ఏడాదెక్కడండీ? ఆరునెలలో ఏడునెలలో కాపురంచేసింది. పట్టుమని ఏడాదైనా కలిసి ఉండలేదు ఇద్దరూ. దాని దురదృష్టం" అని బోధపరిచింది. తనపినతల్లి కూడా సీత ఎదురుగుండా ఈవిధంగా మాట్లాడడం తనకి అసలే నచ్చలేదు.........అయితే, సీత నారాయణరావుతో ఆరేడునెలలుమాత్రమే కాపురంచేసిందన్నమాట!

సీతని పరామర్శచెయ్యడానికి వచ్చిపోయేవాళ్లందరినీ చూస్తుంటే తనకి ముందు ఒకవిధమైన అసూయ పుట్టుకొచ్చింది. నారాయణరావు పోయాడని వీళ్లంతా సీతని పరామర్శచెయ్యడానికి వస్తున్నారు. నారాయణరావు పోయాడని తనని పరామర్శచెయ్యడానికి ఎవరూరారుకదా!

రాత్రింపొగళ్లు ఇద్దరూ కలిసేఉండడంవల్ల పరామర్శఏడుపులు వాళ్లిద్దరినీ బాధించడం మానేసేయి. అప్పుడప్పుడు వాళ్లిద్దరే ఉన్నప్పుడుకూడా సీత ఏడుస్తున్నప్పటికీ చాలావరకు వాళ్లు అన్నివిషయాల గురించీ సామాన్యంగా మాట్లాడుకునేవారు. ముఖ్యంగా సీత ముందుముందు చదువుకోడంగురించి ప్రశ్నలువేస్తూ ఉండేది. మళ్లీ, ఉండిఉండి సీత కంటనీరుమాత్రం పెట్టుకుని నారాయణరావుగురించి మాట్లాడుతూఉండేది. సీత అలామాట్లాడడం తనకినచ్చేదికాదు. దుఃఖం ఎంతగొప్పదైతే అంతమౌనంగాఉండాలని తనఉద్దేశ్యం. అందువల్లనో, లేకమరేకారణంవల్లనో సీత నారాయణరావువిషయమై మౌనంగాఉండకపోవడం తనకి కష్టంగాతోచేది. తనదేశపుస్త్రీలు చనిపోయినభర్తల గురించి మౌనంగాఉండాలని తనఉద్దేశ్యం. కాని సీత నిరాటంకంగా తనభర్తగురించి మాట్లాడేది. సీతప్రవర్తన సామాన్య ప్రవర్తనకి ఎప్పుడూ వ్యతిరేకమే!

ఒకసారి సీత మాటలధోరణిలో "అక్కయ్యా, నీకూ నాకూ నడకలోనూ, నవ్వడంలోనూ చాలాపోలిక ఉందిఅంటూఉండేవారు. నాతో చాలాసార్లుఅన్నారు." అనిచెప్పింది.........తనగురించి సీతతో అప్పుడప్పుడు మాట్లాడేవాడన్నమాట!

ప్రతిరోజూ సీత ఒకతోలుపెట్టెతెరిచి అనేక ఉత్తరాలలో వెతికివెతికి కొన్ని ఉత్తరాలు పైకితీసి వాటిని చదువుకుంటూ ఏడుస్తూఉండేది. అవి సీతకి నారాయణరావు వ్రాసిన ఉత్తరాలు అయిఉండాలని తనుగ్రహించింది. కాని వాటిగురించి తనుఏమీ ప్రశ్నలు వెయ్యలేదు. ఒకరోజున సీతకి ఏమిబుద్ధిపుట్టిందో ఆపెద్ద ఉత్తరాలకట్టతెచ్చి తనఎదురుగుండా పెట్టింది. వాటిమీద నారాయణరావువ్రాత తను వెంటనే పోలికపట్టింది. "వీటన్నిటినీ విప్పి నన్ను చదవమంటుందికాబోలు సీత!" అని భయపడింది. సీత ఏడుస్తోంది. చూస్తూ ఊరుకోలేక "ఎందుకంత దుఃఖపడతావు, సీతా? ఏమిటే ఉత్తరాలన్నీ? వాటిని చూసుకుని మరీ దుఃఖపడుతున్నావు నువ్వు." అంది తను. "ఆయన ఉత్తరహిందుస్థానంలో ఉండగా నాకు వ్రాసిన ఉత్తరాలక్కయ్యా. నాకిప్పుడు మిగిలిన వివే" అంటూ ఏడ్చిందిసీత. తనకి అమితమైన కోపం వచ్చింది. అది ఒట్టి అసూయ అనేందుకు వీలులేదు. ఈఉత్తరాలకి నూరింతలు ఉద్రేకపూర్వకమైన ఉత్తరాలు నారాయణరావు ఒకానొకకాలంలో తనకి వ్రాశాడు. ఇవి అతను దూరదేశంలో ఉన్నప్పుడు మర్యాదకి కుశల ప్రశ్నలు వేస్తూ అప్పుడప్పుడు పెళ్లానికి వ్రాసిన ఉత్తరాలు అయిఉండాలి. నారాయణరావు తనకివ్రాసినవి స్వచ్ఛమైన ప్రేమయొక్క దౌర్బల్యంలో వ్రాసినవి. సీత ఈఉత్తరాలు తనఎదురుగుండాపెట్టి ఏడవడం చాలా అసహ్యం అనిపించింది తనకి. సీత ఈదుఃఖం ఏదో గొప్పఆభరణంఅయినట్టూ, ఈ ఆభరణంలో నారాయణరావు ఉత్తరాలు వజ్రాలూ, కెంపులూ అయినట్టూ ప్రదర్శిస్తోంది. ఇంకావెక్కివెక్కి ఏడుస్తోంది. ఒకవైపు కన్నీరు ధారలుగా కారుతున్నా, సీత ఉత్తరాలు చదవడంమట్టుకు మానలేదు.

ఇంతట్లో సీత ఒకఉత్తరం ప్రత్యేకంగా తీసి తనకి చదవమని ఇచ్చింది. నారాయణరావు సీతకి వ్రాసు

కున్న ఉత్తరాలు చదువుదామన్న అభిలాష తనకి లేనే లేదు. ఎందుకు తనకీ ఉత్తరాలు ?.........ఆక్షణం తనకి ఆఉత్తరాలన్నీ తీసుకుని వీథిలోకి విసిరేద్దామన్నంతకోపం వచ్చిరది. ఆక్షణం సీతతో తన రహస్యం, నారాయణరావురహస్యం చెప్పేదామన్నంత ఉడుకుబోతుతనం వచ్చింది. సీతతో "నువ్వు వెర్రిదానవుకాని, నారాయణరావు నన్నొక్కర్తెనే ప్రేమించాడు. అతనిదురదృష్టంవల్ల నిన్ను పెళ్లిచేసుకోవలసి వచ్చింది" అని చెప్పేద్దామన్నంత అసహ్యంపుట్టింది.

కాని, మాట్లాడకుండా ఆ ఉత్తరం తీసుకుని చదివింది. చదువుతుంటే ఆకోపంపోయింది. ఆ ఉడుకుబోతుతనం పోయింది. ఆ అసహ్యం పోయింది. మిగిలిన ఉత్తరాలన్నీ చదవాలన్న కుతూహలం మట్టుకు మిగిలింది.........తనకి ఎంత ఉద్రేకపూర్వకంగా వ్రాశాడో ఉత్తరాలు, సీతకిగూడా అంతఉద్రేకపూర్వకంగానూ వ్రాశాడు! నిజంగా సీతని ఇంత ప్రేమించాడా అతను ? సందేహం లేదు.........అతనితో ఆరేడునెలలు కాపురంచేసిన సీత !

మిగిలిన ఉత్తరాలన్నీకూడా చదవనిచ్చిందిసీత. తనకి వాటిని చదివేందుకు ఏమీహక్కు లేదని తెలుసును. సీత తెలివితక్కువమూలానో గర్వం మూలానో వాటిని తనకిచదివేందుకు ఇచ్చింది కాని, అవి ఇతరులు చదవవలసిన ఉత్తరాలుకావని తెలుసును... సీతని అతను నిజంగా ప్రేమించాడు! లేకపోతే ఇటువంటి ఉత్తరాలు వ్రాయలేకపోను......ఉత్తరాలన్నీ ఒకటొకటిగాతీసి చదివింది. అందులో కొన్ని ఉత్తరాలు మళ్లీమళ్లీ చదివింది. అన్నీ చదవడం అయాక సీతగదిలో కూర్చోలేకపోయింది. లేచి వరండాలోకి వెళ్లి ఒంటరిగా కూర్చుంది.

మళ్లీ అన్నివిషయాలూ ఆలోచించింది...నిజంగా నారాయణరావుకి తనంటే ఎంతప్రేమ ఉండేదో సీత అంటేకూడా అంతప్రేమా ఉండేదా? ఉండేఉండాలి. లేకపోతే, అటువంటి ఉత్తరాలు ఎలా వ్రాయగలుగుతాడు ? పెళ్లిచేసుకున్నాక నారాయణరావు తనమాట ఆలోచించనేలేదన్నమాట ! తనదంతా ఏదో కలలోని కథే అన్నమాట ! ఇప్పుడన్నీ జ్ఞాపకం వచ్చాయి — ఉత్తరాలు వ్రాయకపోవడం, చెన్నపట్నంలో ఉండి చూడడానికి రాకపోవడం......రాజమహేంద్రవరం స్టేషన్‌లో ఆనాడు తను ఒకవేళ పిలిచినాకూడా పలకకపోయి ఉండునేమో!......సీత ఆరేడు నెలలు కాపురంచేసింది అతనితో !

ఒకవేళ నిజంగా ప్రేమించకపోయినప్పటికీ అటువంటి ఉత్తరాలు సీతకి తంటాలుపడి వ్రాసిఉండకూడదూ ?......అంత కపటం ఉన్నమనిషైతే ఆకపటం తనకివ్రాసిన ఉత్తరాలలోనే ఎక్కువ ఉండేమో ! ఏమో, ఎవరుచెప్పగలరు ? ఏదీ తెలియదు.

తనకి ఏమీ బోధపడలేదు. ఇన్నాళ్లూ నారాయణరావు తననేప్రేమించాడనుకుంది. మరెవరినీ తర్వాత ప్రేమించలేదనుకుంది. ఇప్పుడు తనని అతను ప్రేమించాడో, లేదో తెలియదు. సీతని ప్రేమించాడో, లేదో తెలియదు. ఇద్దరిలో ఎవరిని ఎక్కువ ప్రేమించాడో అసలే తెలియదు. ఏమీతెలియదు. అంతా సందేహాస్పదం.

ఒక్కవిషయంలో సందేహాలు అనవసరం. తను ఇల్లుచేరుకోగానే నారాయణరావు ఉత్తరాలూ, నారాయణరావుఫోటో ముక్కలు ముక్కలుగా, చింపి వీథిలో పారెయ్యాక తప్పదు.

ఈ భూలోకం చాలా విచిత్రమైనది. ఎవరికీ మరొకరిసంగతి తెలియదు. కాని అందరూ మిగిలిన అందరిజీవితాలలోనూ చొరబడతారు. నారాయణరావుకీ, తనకీ ఉన్నసంబంధం సీతకి ఏమాత్రమూ తెలియదు. సీతకీ, నారాయణరావుకీ ఉన్నసంబంధం తనకి ఏమాత్రమూ తెలియదు. తనకీ, సీతకీకూడా నారాయణరావు నిజంగా ఎటువంటివాడో అసలే తెలియదు. నారాయణరావు పోయినందుకు సీతని పరామర్శచెయ్యడానికి తను తయారిక్కడ......తనకే నవ్వొచ్చింది.

పైకినవ్వింది. ఆపైకినవ్వడం చాలాసూక్ష్మంగా అయినప్పటికీ పైకిమట్టుకు నవ్వింది. ఆనవ్వడం తన వీరభద్రమ్మపిన్ని చూసింది. చూచి ఆవిడ "అందరూ ఓదార్చడానికి వస్తుంటే, ఇది నాకూతురికికూడా తనగతే పట్టిందికదా అని కులుకుతున్నట్టుంది. లేకపోతే ఈ ఇంట్లో ఆనవ్వేమిటి ?......దీని పొగరుమోతుతనం ! " అనుకుని విసుక్కుంది. ఇంతట్లో ఎవరో ధగధగమెరిసే బనారసుచీరెకట్టుకుని పరామర్శకివస్తే మళ్లీ ఆవిడ కంటనీరు పెట్టుకుని చీరెకొంగుతో కళ్లు అద్దుకుంటూ యథాప్రకారంగా ఏడవడం ప్రారంభించింది.